క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

మణుగూరురూరల్: ఆర్టీసీ కార్మికులపై అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని, వెంటనే ఆ చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మణుగూరు ఆర్టీసీ డిపో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు టి.సుధాకర్, కెవి.రామారావులు మాట్లాడుతూ... బండ్లగూడ డిపో కండక్టర్ శ్రీవిద్య అధికారుల వేదింపులు తాళలేకనే ఆత్మహత్యకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అధికారులు కావాలనే కార్మికులను అక్రమంగా, అనవసరంగా బదిలీలు, సస్పెన్షన్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి వేదింపు చర్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.సలీం, రమేష్, ఎస్‌కె.పాషా, ఆర్ఎస్ రావు, శ్రావణి, టీఎంయూ నాయకులు ఏ.నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారికి వినతి

మణుగూరురూరల్: ఎన్నికల నియమావళి దిక్కరింపునకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే బీఆర్ఎస్ పార్టీ వారు ఎక్కడపడితే అక్కడ ప్రచార పోస్టర్లను అంటిస్తున్నారని, అనుమతులు పొందకుండానే పలు కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పున్నం భిక్షపతి, లింగంపల్లి రమేష్, బీర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్ బ్యాగ్‌ల పంపిణీ

దుమ్ముగూడెం: ఐటీసీ బంగారు భవిష్యత్తు సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో మండల పరిధిలోని భీమవరం గ్రామాన్ని క్లైమేట్ స్మార్ట్ విలేజ్ లాగా తీర్చి దిద్దలనే లక్ష్యంతో గురువారం రైతులకు వర్మీ కంపోస్ట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఉచితంగా వర్మీ కంపోస్ట్ బ్యాగ్‌లను పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, కమ్యూనిటి ఆర్గనైజర్ సోడి తిరుపతి రావు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

భద్రాచలం: మైనర్ బాలికను ట్రాప్ చేసిన బీఆర్‌యస్ నాయకుడు సతీష్‌పై కఠిన చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకుడు సతీష్ తమ ప్రాంతంలోని ఓ బాలికను మాయ మాటలతో ఓ ప్రైవేటు లాడ్జికి తీసుకువెళ్లాడని, విషయం తెలుసుకున్న బాలిక తల్లి పోలీసులకు సమాచారం అందించడంతోపాటు సతీష్‌కు దేహశుద్ధి చేసిందని అన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగకుండా పోలీసులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సరెళ్ళ నరేష్, నాయకులు సరెళ్ళ వెంకటేష్, చింతిరేల సుధీర్, ఎడారి ప్రదీప్, రాసమల్ల రాము, సూరంపూడి రాంప్రసాద్, కుందవరపు శ్యామ్, కోలపూడి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు అవసరం

చర్లరూరల్: విద్యార్థి దశ నుంచే క్రీడలు ఎంతో అవసరమని చర్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు అన్నారు. పాతచర్ల అంబేద్కర్ నగర్ అండర్–19 షటిల్ టోర్నమెంట్స్‌ను గురువారం ప్రారంభించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

పరామర్శ..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవరపు వెంకటయ్య మృతదేహంపై గురువారం మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన చల్లా వెంకటరమణ కుటుంబసభ్యులనూ పాయం పరామర్శించారు. మండల కేంద్రంలోని కాలువబజార్‌లో కేశని కుమారస్వామి మృతదేహానికి పాయం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, కాంగ్రెస్ నాయకులు ముత్తినేని వాసు, ఓరుగంటి రమేష్, గాదె కేశవరెడ్డి, వేములపల్లి రమేష్, తూము పెద వీరరాఘవులు, ఆవుల రవి, రాగం మల్లయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడ్ అమలుపై ఖాకీల ఫోకస్

- కట్టుదిట్టంగా చెక్‌పోస్టులు ఏర్పాటు
- నగదు, మద్యం తరలింపునకు అడ్డుకట్ట
- మావోయిస్టుల ఇలాఖాలో నిరంతర తనిఖీలు



తూరుబాక అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో పోలీస్ యంత్రాంగం ఓటర్లు ప్రలోభాలకు గురి చేసే అంశాలపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా మండలంలోని సరిహద్దు గ్రామాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వీటిద్వారా తెలంగాణలోకి ఛత్తీస్‌గఢ్, ఆంధ్రా రాష్ట్రాల నుంచి తరలివచ్చే నిషేధిత వస్తువులకు ఆదిలోనే చెక్ పెడుతున్నారు. మండల వ్యాప్తంగా నిత్యం ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే చర్యలు చేపడుతున్నారు. 24 గంటలు మండలంలో ఎదో ఒక చోట తనిఖీలు చేస్తూ నాటు సార రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు.అలాగే పేకాట, కోడిపందాలపై దాడులు నిర్వహిస్తూ వాటికి అడ్డుకట్ట వేస్తున్నారు.

ముమ్మరంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు

ఎన్నికల నేపథ్యంలో మండలంలో పోలీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులను ఉధృతం చేశారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి పలు కేసులను నమోదు చేశారు. గతంలో వివిధ కేసుల్లో అరెస్ట్ అయిన వారిని ముందస్తుగా కౌన్సెలింగ్ ఇస్తూ అవసరం అయితే బైండోవర్ సైతం చేస్తున్నారు. నాటు సార తరలించే వారిపై ఇప్పటి వరకు 7 కేసులు నమోదు చేసి వారి నుంచి వందల లీటర్ల నాటుసారను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పేకాట, కోడి పందాలపై 6 కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

మావోయిస్టుల కట్టడికి వ్యూహాలు

మండలానికి సరిహద్దులోనే ఛత్తీసగఢ్ దండకారణ్యం ఉండటంతో అక్కడ మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉంది.

అసెంబ్లీ ఎన్నికల ముందు తమ ఉనికిని చాటుకోవడానికి ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతంతో పాటు సరిహద్దులలో ఎక్కడో ఓ చోట అవాంఛనీయ ఘటనలకు పాల్పడే అవకాశాలు ఉండటంతో పోలీసులు ప్రత్యేక బలగాలతో అటవీప్రాంతాలను ముమ్మరంగా గాలిస్తున్నారు. మావోయిస్టులు బోర్డర్ దాటి రాకుండా చేసేందుకు తగిన వ్యూహాలను పోలీసులు పన్నుతున్నారు. అటవీప్రాంతాల్లో అనుమానితులను విచారించి మావోయిస్టుల జాడను కనుగునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సరిహద్దు గ్రామాల్లో పోలీసులు పర్యటిస్తూ ఆదివాసీ గ్రామాల ప్రజలకు కొత్త వ్యక్తుల సంచారం ఉంటే సమాచారం అందించాలని సూచిస్తున్నారు. మండలంలోని పర్ణశాల, సున్నంబట్టి, కాశీనగరం, దుమ్ముగూడెం, సీతారాంపురం గోదావరి పాయింట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజలు సహకరించాలి..



ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు అధికారులకు సహకరించాలి, ఎన్నికల నియామావళి ప్రకారం నడుచుకోవాలి. ప్రజలు ప్రయాణ సమయంలో రూ.50వేల నగదుకు మించి తమ వెంట తీసుకుని వెళ్తే దానికి తగ్గ రసీదులు వెంట ఉంచుకోవాలి. మండల వ్యాప్తంగా గట్టి పోలీస్ నిఘాను ఏర్పాటు చేశాం. అసాంఘిక శక్తులపై 24గంటల నిఘా ఉంచాం. సరిహద్దుల్లో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశాం. గంజాయి,నగదు, నిషేధిత వస్తువుల తరలింపునకు చెక్ పెడుతున్నాం.

– కేశవరావు, ఎస్సై

ఏర్పాట్లలో లోపాలు ఉండొద్దు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏరియా జీఎం రామచందర్

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో ఈ నెల 22వ తేదీన సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలు, ఫ్యామిలీడే ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం భద్రాద్రి స్టేడియంలో జరుగుతున్న వేడుకల ఏర్పాట్లను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏరియాలోని సింగరేణీయులు, వారి కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి వేడుకలు చేసుకుంటారన్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు ఏర్పాటు చేయాలని, గ్రౌండ్ లెవల్, బతుకమ్మల నిమజ్జనానికి రహదారి మార్గం, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం సెక్యూరిటీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేడుకలు విజయవంతమయ్యే ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం వి.కృష్ణయ్య, ఏజీఎంలు వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, డీజీఎం(పి) రమేష్, డాక్టర్ శేషగిరిరావు, సీనియర్ పీఓలు ఎస్.శ్రీనివాస్, వి.రామేశ్వరరావు, సెక్యూరిటి అధికారి షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే భవిష్యత్‌కు భరోసా



బూర్గంపాడు: పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

బూర్గంపాడు: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రజల భవిష్యత్‌కు భరోసా లభిస్తుందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని సారపాక, రాజీవ్‌నగర్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామాలకు చెందిన 200 కుటుంబాలు గురువారం బీఆర్ఎస్‌లో చేరాయి. రేగా కాంతారావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విపక్షాల మోసపూరిత హామీలను నమ్మొద్దన్నారు. పోరాడిన సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం పదేళ్లకాలంలో అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్‌గా మారిందన్నారు. ప్రజల అభివృద్ధి సంక్షేమానికి ప్రభుత్వం రైతుబంధు, మిషన్ భగీరథ, కల్యాణలక్ష్మి వంటి పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. అయా కార్యక్రమాలలో సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బిజ్జం శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ భూక్యా శ్రావణి, ఉపసర్పంచ్ యడమకంటి ఝాన్సీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, కామిరెడ్డి రామకొండారెడ్డి, గొనెల నాని, కొనకంచి శ్రీనివాస్, బాలి శ్రీహరి, మొండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, వలదాసు సాలయ్య, మేడగం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట గ్రామంలో కాంగ్రెస్, వివిధ పార్టీలను వీడి సుమారు 120 కుటుంబాల వారు పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే రేగా కాంతారావు వీరందరికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



చంద్రుగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



దమ్మపేట: ప్రచారం నిర్వహిస్తున్న జారే ఆదినారాయణ

మణుగూరురూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం గడప గడపకూ కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్, గ్యారెంటీ కార్డ్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. కార్యక్రమంలో మణుగూరు వైస్‌ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు వెంకట్రావు గౌడ్, గోరంట్ల కనకయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దమ్మపేట: అసెంబ్లీలో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు జారే ఆదినారాయణ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పెద్దగొల్లగూడెం గ్రామంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించి, పార్టీ గ్యారంటీ పథకాలుపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాయుడు శ్రీను, శ్రీరాముల ప్రసాద్, గోపిశాస్త్రి, నాగేంద్ర, పెద్దబాబు, కుమార్, వాసం శ్రీను, ఏసుమణి తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ..

చంద్రుగొండ: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేసినా గెలుపు కోసం కృషి చేద్దామని ఆ పార్టీ నాయకులు ముక్తకంఠంతో చెప్పారు. గురువారం బస్టాండ్ సెంటర్ నుంచి ప్రధాన సెంటర్ మీదుగా అయన్నపాలెంలోని లక్ష్యాగార్డెన్స్ వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రచార ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీపీ బాణోత్ పార్వతి, మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, నల్లమోతు రమణ మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం కాంగ్రెస్‌పార్టీదేనన్నారు. వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, పి.భిక్షమయ్య, దారం గోవిందరెడ్డి, సారేపల్లి శేఖర్, సాబీర్‌హుసేన్, కేశబోయిన నర్సింహారావు, అంతటి రామకృష్ణ, సంకా కృపాకర్, యండి.అన్వర్ పాల్గొన్నారు.

అండగా ఉంటాం..

చర్ల: విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన సీఐటీయూ కార్యకర్త తాటి ఆదినారాయణ కుటుంబానికి అండగా ఉంటామని తెలంగాణా స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొలగాని రమేష్, బొల్లి వెంకటరాజు పేర్కొన్నారు. ఈ నెల 9న దుమ్ముగూడెం మండలంలోని గంగోలులో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన సబ్ స్టేషన్ గ్రేడ్ 3 ఆర్టీజన్ కార్మికుడు తాటి ఆదినారాయణ కుటుంబాన్ని గురువారం వారు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మాచారితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో వారు మాట్లాడారు. ఆదినారాయణ మృతి తీరని లోటని మృతుడి కుటుంబానికి యూనియన్ పూర్తిగా అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం సాయం కోసం సీపీఎం ఆధ్వర్యంలో దుమ్ముగూడెంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి అధికారుల ద్వారా హామీ తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు. కుటుంబానికి రూ 7 లక్షల ఆర్థిక సాయంతో పాటు మృతుడి బార్యకు విద్యుత్ శాఖలో చట్టబద్ధమైన బెనిఫిట్స్‌తో ఉద్యోగం ఇచ్చేందుకు అధికార యంత్రాంగం అంగీకరించిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ తరుపున కుటుంబానికి రూ.73 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధి ఏమీ లేదు..



మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్

దుమ్ముగూడెం: బీఆర్ఎస్ పార్టీ తన 10 సంవత్సరాల పరిపాలనలో చేసిన అభివృద్ధి ఏమి లేదని, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎంను గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గడిన 10 ఏళ్లలో భద్రాచలం నియోజకవర్గంలో అభివృద్ధి లేదని, ఆనాటి సీపీఎం ఎమ్మెల్యేలు ముర్ల ఎర్రయ్యరెడ్డి, కుంజా బొజ్జి, సున్నం రాజయ్య ఎనలేని సేవలు అందిచారని అన్నారు. రానున్న ఎన్నికల్లో సీపీఎంను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం భద్రాచలం నియోజకవర్గ కో–కన్వీనర్ కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, నాయకులు యలమంచి శ్రీనుబాబు, సారంపల్లి త్రినాధరావు, చుక్క గణేష్ రెడ్డి, బైరెడ్డి సతీష్, మునలి రాంబాబు, వేణు, దబ్లి సతీష్, బాబురావు, కర్రీ బుజ్జి, శంకర్, సర్పంచ్ మడి రాజేష్,షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధాన్ని నిలుపుదల చేయాలి

బూర్గంపాడు: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే నిలుపుదల చేసేందుకు ప్రపంచ దేశాలు సిద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు వైఎస్ రెడ్డి అన్నారు. పాలస్తీనాపై జరుగుతున్న యుద్ధంపై గురువారం లక్ష్మీపురం గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణమే శాంతిచర్చలు జరిపేందుకు ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలన్నారు. మడివి రాజు, ఇర్పా శేఖర్, చంద్రమ్మ, భద్రు, గణేష్ పాల్గొన్నారు.

అనర్హత వేటు వేయాలి

బూర్గంపాడు: పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు వేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఓ పార్టీలో గెలిచి అధికార దాహంతో పార్టీలు మారుతున్న ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు వేయాలని కోరారు.

సంబురంగా బతుకమ్మ వేడుకలు



అశ్వారావుపేటరూరల్: మద్దిరావమ్మ గుడి సెంటర్‌లో పూల పండుగ సందడి..



మణుగూరురూరల్: కోలాటం ఆడుతున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న దంపతులు

చర్ల: మండలంలో బతుకమ్మ వేడుకలు సంబురంగా సాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న గద్దెల వద్ద మహిళలు రంగు రంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకొచ్చి నృత్యాలతో సందడి చేస్తున్నారు. దీంతో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సందడితో నెలకొంటోంది.




చర్ల: ఆర్ కొత్తగూడెంలో బతుకమ్మ సంబురాల్లో మహిళలు

అశ్వారావుపేటరూరల్: బతుకమ్మ పండుగ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. అశ్వారావుపేటలోని మద్దిరావమ్మగుడి సెంటర్, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి, రామాలయం, శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి పూల పండుగను జరుపుకున్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు ఇళ్ల వద్ద వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా ముస్తాబు చేసి తీసుకొచ్చి, ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు జారే ఆదినారాయణ, ములకలపల్లి జెడ్పీటీసీ, టీపీసీసీ సభ్యురాలు సున్నం నాగమణి ఉత్సాహంగా పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో..

మణుగూరురూరల్: మండలంలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా కార్మికులు, ఉద్యోగులు రంగు రంగుల పూలను సేకరించి బతుకమ్మలను సుందరంగా పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. సీఈ బి.బిచ్చన్న దంపతులు మహిళలు, చిన్నారులతో కలిసి నృత్యాలు చేశారు. బీటీపీఎస్ డీఈ సత్యనారాయణ, ఎస్ఈలు, ఇంజనీరింగ్ ఉద్యోగులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



మణుగూరురూరల్: మహాచండీ అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు



అశ్వారావుపేటరూరల్: కొత్త మామిళ్లవారిగూడెంలో అన్నసమారాధన..

అశ్వారావుపేటరూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం, నారంవారిగూడెం, వినాయకపురం, అశ్వారావుపేటలో అమ్మవారు చండీదేవి అలంకరణలో దర్శనం ఇవ్వగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని వివిధ రకాల పూజలు చేశారు. అలాగే పలు చోట్ల మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం ఏర్పాటు చేసిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మణుగూరురూరల్: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పైలట్‌కాలనీ కాళీమాత, గుట్టమల్లారంలోని శ్రీపంచముఖ వేదగాయత్రీదేవి, సీఎస్‌పీ కాటా వద్ద ఉన్న కనకదుర్గ, ఓసీ–2 ఓంశక్తి ఆలయాల్లో, సుందరయ్యనగర్, భగత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని మండపాల్లో అమ్మవారు ఐదో రోజు మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పట్టుచీరెలు, పూలు, అభరణాలతో తేజోమయంగా ముస్తాబు చేశారు. అనంతరం పసుపు, కుంకుమలు, పూలతో పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

దమ్మపేట: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మండపాల్లో నాలుగో రోజు అమ్మవారిని చండీదేవి రూపంలో అలంకరించారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీగాయత్రి ఆశ్రమంలో అమ్మవారు భక్తులకు చండీదేవి రూపంలో దర్శనమిచ్చారు. అర్చన, హోమం, చండీ సప్తశతి పారాయణం తదితర పూజా కార్యక్రమాలను ఆశ్రమ వ్యవస్థాపకుడు మూర్తిజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దర్శించుకున్న భక్తులు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు.

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలో ఆటో అడ్డాలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఐదో రోజు గురువారం అమ్మవారిని లలితాదేవి అవతారంలో అలంకరించారు. ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కలిగించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలోని గురువారం అమ్మ వారు ధాన్యలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయంలో కొలువుదీరిన అమ్మ వారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించారు. మండలంలో కొలువుదీరిన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ములకలపల్లి: దేవీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మండల కేంద్రంలోని ఉమాపృథ్వీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారు గురువారం ఉమాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. స్థానిక కమిటీ ఆధ్వర్యంలో రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, రెవెన్యూ సిబ్బంది అమ్మవారిని దర్శించుకున్నారు.



ములకలపల్లి: అమ్మవారిని దర్శించుకున్న తహసీల్దార్ పుల్లారావు, రెవెన్యూ సిబ్బంది



అన్నపురెడ్డిపల్లి: ధాన్యలక్ష్మి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు